

పల్లె వెలుగు

తెలుగు
జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

| RNI APTEL 2013/54510 |




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 323 | పేజీలు - 08 | వెల - 05/- | శుక్రవారం 20-11-2026

విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లపై

సీఎం సమీక్ష

- సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ అభివృద్ధి
- గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి
- క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి రాజధాని
- సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్



ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే-టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు.

విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

మిగతా 2లో

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం

సహకరించాలి

దేశాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలి

2047 నాటికి రూ.3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

తెలంగాణ రహదారి ప్రతిపాదనలకు ఆమోదం ఇవ్వాలి

మూడు ప్రాంతాలుగా రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక

తయారీ, వ్యవసాయ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత



హైదరాబాద్:తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కోరారు. దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తూ ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు తెలంగాణ తనవంతు కృషి చేస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సును కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మిగతాది 2లో

ఈపీఎఫ్ఓ చందాదారులకు

భారీ ఊరట..

- 55 ఏళ్లలోపు సభ్యులకు పీఎఫ్ విత్‌డ్రా పరిమితి 90 శాతానికి పెంపు
- పీఎఫ్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ నిల్వ 25 శాతం నుంచి 10 శాతానికి తగ్గింపు
- ఉద్యోగం కోల్పోయిన వారికి నిరీక్షణ వ్యవధి 12 నెలల నుంచి 2 నెలలకు తగ్గింపు




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తమ చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. 55 ఏళ్లలోపు వయసున్న సభ్యులు తమ పీఎఫ్ నిధి నుంచి ఉపసంహరించుకునే (విత్‌డ్రాయల్) పరిమితిని గతంలో

మిగతాది 2లో

టీవీకే ఎమ్మెల్యే కన్నుమూత

- కొళత్తూరు టీవీకే ఎమ్మెల్యే వీఎస్ బాబు గుండెపోటుతో మృతి
- తీవ్ర శ్వాసకోశ సమస్యతో చెన్నై ఆసుపత్రిలో చికిత్స.. నేడు తుదిశ్వాస
- 2026 ఎన్నికల్లో ఎంకే స్టాలిన్‌పై సంచలన విజయం
- బాబు మరణం తీరని లోటన్న సీఎం విజయ్
- వీఎస్ బాబు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంకే స్టాలిన్



అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను..?



రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనన్న సిద్ధరామయ్య

వయోభారం వల్లే పోటీకి దూరంగా ఉంటున్నట్లు వెల్లడి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేసే ప్రసక్తే లేదని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తనకు ప్రస్తుతం 80 ఏళ్లు వచ్చాయని, ఈ వయసులో ఎన్నికల బరిలోకి ఎలా దిగుతానని ఆయన ప్రశ్నించారు. మైసూర్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తన నిర్ణయానికి వయసే ప్రధాన కారణమని పునరుద్ఘాటించారు. ఆయన మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అనుచరులు ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో సిద్ధరామయ్య చేసిన

మిగతాది 2లో

మూడో విడత పంచాయతీ ఎన్నికల

షెడ్యూల్ విడుదల

డిసెంబర్ 2న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్

పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు

అదే రోజు సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాల వెల్లడి

ఫలితాల రోజునే ఉప సర్పంచ్ ఎన్నిక



విజయనగరం జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారికంగా నోటిఫికేషన్ వెలువడింది. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈ మూడో దశ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ విడతలో జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్లకు పరిధిలోని మొత్తం తొమ్మిది మండలాల్లో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఎన్నికలు జరగనున్న తొమ్మిది మండలాలను రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా విభజించారు.

మిగతాది 2లో

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైసీపీ

విషప్రచారం చేస్తోంది

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైసీపీ విమర్శలను తిప్పికొట్టిన ఎమ్మెల్సీ ఆలపాటి
- గత ప్రభుత్వం పెట్టిన వేల కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం తీర్చుతోందని వెల్లడి
- రీయింబర్స్‌మెంట్ కోసం మూడేళ్లలో రూ. 4,962 కోట్లు కేటాయించినట్టు వివరణ
- సగటు ఫీజును రూ. 35 వేల నుంచి రూ. 45 వేలకు పెంచినట్టు స్పష్టీకరణ
- విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని కాలేజీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఉద్ఘాటన



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైసీపీ నాయకత్వం చేస్తున్న విమర్శలు

మిగతాది 2లో

రాజగోపాల్‌రెడ్డి,

అనిరుధ్ వ్యాఖ్యలపై హైకమాండ్ నిఘా

- క్రమశిక్షణ విషయంలో నాయకులందరికీ ఒకే నిబంధనలు ఉంటాయన్న మహేశ్ గౌడ్
- కృష్ణా జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపణ
- ఎస్ఎల్బీసీ, పాలమూరు ప్రాజెక్టులను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శ



కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ పరంగా అందరూ సమానమేనని, నేతలు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సొంత పార్టీ తీరుపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతాది 2లో

జగన్ అక్రమాస్తుల కేసులపై హైకోర్టు దృష్టి



-వైఎస్ జగన్ కేసులపై తెలంగాణ హైకోర్టులో విచారణ
-న్యాయ ప్రక్రియ 15 ఏళ్లుగా సాగుతోందన్న ఈడీ

జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై ఈరోజు తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసుల ప్రస్తుత పరిస్థితిపై పూర్తి స్థాయి స్టేటస్ రిపోర్టును సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుల విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో పాటు మాజీ ఎంపీ హరిరామజోగయ్య వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంలో దర్యాప్తు, న్యాయ ప్రక్రియ దాదాపు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైసీపీ విషప్రచారం చేస్తోంది

వైసీపీ నాయకత్వం చేస్తున్న విమర్శలు అర్థరహితంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో విద్యా రంగాన్ని తీవ్రంగా అస్తవ్యస్తం చేసి, వేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి వెళ్లిన వైసీపీ నేతలు.. ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు చదువు పూర్తయినా సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కేవలం విద్యారంగమే కాకుండా సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ, రైతులు, కాంట్రాక్టర్లు.. ఇలా ప్రతి రంగంలోనూ వైసీపీ వేల కోట్ల బకాయిలు పెట్టిందని ఆరోపించారు. సీఎఫ్ఎంఎస్ విధానాన్ని దుర్వినియోగం చేస్తూ తమ అనుకూల వర్గాలకే నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ భారం అనుకోకుండా బాధ్యతగా స్వీకరించి దశలవారీగా చెల్లిస్తోందని స్పష్టం చేశారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆలపాటి వివరించారు. విద్యార్థులపై ఎలాంటి మానసిక ఒత్తిడి తీసుకురావద్దని, ఫీజుల విషయంలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని కాలేజీ యాజమాన్యాలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఫీజు ఫిక్సేషన్ కమిటీ ద్వారా కనీస ఫీజును రూ. 35,000కు తగ్గించి కాలేజీలను వేధించారని, కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని విద్యాసంస్థల మనుగడను దృష్టిలో ఉంచుకుని సగటు ఫీజును రూ. 45,000కు సవరించిందని వెల్లడించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా 2024--25 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,450 కోట్లు, 2025--26లో రూ. 1,666.21 కోట్లు, ప్రస్తుత 2026--27 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,845 కోట్లతో కలిపి మొత్తం రూ. 4,962 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.

గత ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమై బటన్లు నొక్కడమే తప్ప, క్షేత్రస్థాయిలో సమస్యలను పట్టించుకోలేదని ఆలపాటి ఆరోపించారు. వసతి దీవెన, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఫీజు చెల్లింపుల్లో ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేస్తూ, వైసీపీ నేతలు ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

మూడో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

పరిధిలోని మొత్తం తొమ్మిది మండలాల్లో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది.

ఎన్నికలు జరగనున్న తొమ్మిది మండలాలను రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా విభజించారు. విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలో భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ, విజయనగరం మండలాలు ఉన్నాయి. అలాగే చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, మెరకముడిదాం, గరివిడి, గుర్ల మండలాల్లో ఓటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అదే రోజు వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించడంతో పాటు, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభిస్తారు. నామినేషన్లు దాఖలు చేయడానికి నవంబర్ 23 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. ఆ మరుసటి రోజు అంటే నవంబర్ 24 ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు.

నామినేషన్ల తిరస్కరణకు సంబంధించి అభ్యంతరాలు లేదా అప్పీళ్లు ఉంటే నవంబర్ 25 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఆర్డీవోకు సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 26న అప్పిలేట్ అథారిటీ ఈ అప్పీళ్లను పరిష్కరిస్తుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి నవంబర్ 27 మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఇస్తారు; ఆ తర్వాత పోటీలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

డిసెంబర్ 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలు వచ్చిన రోజునే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజు సాధ్యం కాకపోతే, సెలవు దినమైనప్పటికీ మరుసటి రోజు ఉప సర్పంచ్ ఎన్నిక చేపడతారని అధికారులు స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయిలో పాలనకు పునాదిగా నిలిచే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకం వంటి అంశాలపై దృష్టి సారించారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్లు నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశ భద్రత, జాతీయ ప్రాధాన్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమం వంటి అంశాల్లో రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి, మిగిలిన సమయాన్ని దేశాభివృద్ధికి కేటాయించాలని సూచించారు.



తెలంగాణ రహదారుల ప్రతిపాదనలకు ఆమోదం ఇవ్వాలి

తెలంగాణలో చేపట్టాల్సిన రహదారి వ్యవస్థకు సంబంధించి అనేక ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రానికి అందించామని సీఎం తెలిపారు. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. 'వికసిత్ భారత్--2047' లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ కూడా స్పష్టమైన విధానాలతో ముందుకు సాగుతోందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను రూ.3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు కేంద్రం కూడా రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.

మూడు ప్రాంతాలుగా రాష్ట్ర అభివృద్ధిరాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించామని సీఎం వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సేవల రంగంగా, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని తయారీ రంగానికి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

ప్రాంతీయ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఈ రంగాల అభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యాలు అవసరమని, అందుకోసం పటిష్టమైన రహదారి వ్యవస్థ ఉండాలని సీఎం పేర్కొన్నారు. నగరాలు, గ్రామాలతో పాటు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానిస్తూ రహదారులను అభివృద్ధి చేయడం ద్వారా అనుసంధానం, రవాణా సౌలభ్యం పెరుగుతాయని చెప్పారు. తద్వారా వ్యాపార, వాణిజ్య రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని వివరించారు.

ఆరోగ్య రంగంలోనూ భారీగా మౌలిక వసతులు

మౌలిక సదుపాయాల కల్పనలో రహదారులతో పాటు వైద్య రంగానికి కూడా తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పురాతన ఉస్మానియా జనరల్ ఆసుపత్రిని అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నామని చెప్పారు.అలాగే రాష్ట్రంలోని టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు మొత్తంగా 8 వేల పడకల సామర్థ్యంతో ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.

హైదరాబాద్‌కు గర్వకారణం

85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్‌కు హైదరాబాద్ వేదిక కావడం గర్వకారణమని సీఎం అన్నారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో భాగస్వాములు కావాలని సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఆర్‌సీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ పది, ఇతర కార్యవర్గ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు, వివిధ సంస్థలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

జగన్ అక్రమాస్తుల కేసులపై హైకోర్టు దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

న్యాయ ప్రక్రియ దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. సీబీఐ కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసుల్లో ఇప్పటివరకు దాదాపు 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయని, దీనివల్ల విచారణలో జాప్యం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులకు సంబంధించి సీబీఐ 11 ఛార్జిషీట్లు, ఈడీ 9 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలు చేశాయి. మరోవైపు, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈ కేసులపై రోజువారీ విచారణ చేపట్టాలని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు... జగన్ కేసుల ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర వివరాలతో స్టేటస్ రిపోర్టు అందించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను నవంబర్ 30కి వాయిదా వేసింది.

రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలపై హైకమాండ్ నిఘా

(మొదటి పేజీ తరువాయి)

, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సదరు ఎమ్మెల్యేల ప్రకటనలను పార్టీ అధిష్ఠానం నిశితంగా గమనిస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణకు త్వరలో రానున్న కొత్త పార్టీ ఇన్‌ఛార్జ్ ఈ పరిణామాలను సమగ్రంగా పరిశీలిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ఒక ప్రజాస్వామిక పార్టీ అని, దేనికైనా సరైన సమయం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో కొండా సురేఖ వ్యవహారంలోనూ చర్యలకు ముందు పలు అవకాశాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి విషయంలో జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని, ఇప్పుడు కేంద్ర బలగాలు డ్యామ్‌ల వద్ద ఉండటానికి ఆ నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణకు కీలకమైన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పదేళ్లపాటు పక్కన పెట్టారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో సుమారు రూ.1.84 లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ఆరోపిస్తూ, కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన 70 శాతం వాటా కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని ఆయన తెలిపారు. అంతకుముందు, హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు వద్ద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి మహేశ్ కుమార్ గౌడ్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. దేశ సమగ్రతకు, పేదల సంక్షేమానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె ఆశయాల సాధనలో భాగంగానే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఈపీఎఫ్ఓ చందాదారులకు భారీ ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

పరిమితిని గతంలో ఉన్న 75 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెంచుతూ ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) గురువారం ఆమోదం తెలిపింది. అంటే ఇకపై ఖాతాదారులు తమ పీఎఫ్ బ్యాలెన్స్‌లో కేవలం 10 శాతం నిల్వ ఉంచితే సరిపోతుంది. అత్యవసర ఆర్థిక పరిస్థితుల్లో సభ్యులు తమ పొదుపు మొత్తాన్ని సులభంగా పొందేందుకు ఈ సంస్కరణ దోహదపడనుంది. దీంతో పాటు ఉద్యోగం కోల్పోయిన వారికి కూడా ఈపీఎఫ్ఓ పెద్ద ఊరట కల్పించింది. గతంలో ఉద్యోగం పోయిన తర్వాత పూర్తి పీఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు 12 నెలల నిరీక్షణ సమయం ఉండగా, దాన్ని కేవలం 2 నెలలకు కుదించింది. దీనివల్ల ఉపాధి కోల్పోయిన వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమ డబ్బును త్వరితగతిన పొందే వెసులుబాటు లభిస్తుంది. మరో కీలక ముందడుగుగా.. మ్యూచువల్ ఫండ్లలో ఉండే తరహాలోనే సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) విధానాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసింది. పదవీ విరమణ పొందిన సభ్యులు తమ మొత్తం పీఎఫ్ నిధిని ఒకేసారి వెనక్కి తీసుకోకుండా, ప్రతి నెలా వాయిదాల రూపంలో (మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్స్) పెన్షన్ తరహాలో క్రమపద్ధతిలో పొందేందుకు ఇది వీలు కల్పిస్తుంది. మిగిలిన మొత్తంపై ఈపీఎఫ్ఓ ద్వారా అధిక వడ్డీ నిరంతరాయంగా లభిస్తూనే ఉంటుంది. ఒకవేళ లబ్ధిదారుడు మరణిస్తే నామినీ ఆ బ్యాలెన్స్‌ను ఒకేసారి ఉపసంహరించుకోవడం లేదా నెలనెలా చెల్లింపులను కొనసాగించే అవకాశాన్ని కల్పించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను..

(మొదటి పేజీ తరువాయి)

మైసూర్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తన నిర్ణయానికి వయసే ప్రధాన కారణమని పునరుద్ఘాటించారు. ఆయన మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అనుచరులు ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ పుస్తకావిష్కరణ సభలో తనకు జరిగినట్లుగా ప్రచారంలో ఉన్న 'సీటింగ్ అవమానం'పై సిద్ధరామయ్య స్పష్టతనిచ్చారు. ఆ కార్యక్రమంలో ఆయనకు ఐదో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన్ను పక్కనపెట్టిందంటూ విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై స్పందించిన ఆయన..

టీవీకే ఎమ్మెల్యే కన్నుమూత

తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కొళత్తూరు నియోజకవర్గ తమిళగ వెట్రి కళగం (టీవీకే) శాసనసభ్యుడు వీఎస్ బాబు (75) గురువారం మధ్యాహ్నం చెన్నైలోని ఎంజీఎం హెల్త్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌పై అనూహ్య విజయం సాధించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వీఎస్ బాబు మరణం రాజకీయ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. శ్వాస సంబంధిత ఇబ్బందులతో బాధపడుతున్న వీఎస్ బాబు సెప్టెంబర్ 9న చెన్నైలోని ఎంజీఎం ఆసుపత్రిలో చేరారు. దాదాపు 70 రోజులకు పైగా ఆయన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందారు. అయితే, ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో నేటి మధ్యాహ్నం 2:14 గంటలకు తీవ్ర గుండెపోటు వచ్చింది. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మధ్యాహ్నం 2:24 గంటలకు ఆయన మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు అధికారికంగా ధ్రువీకరించాయి. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వీఎస్ బాబు సృష్టించిన విజయం ఒక చారిత్రక మైలురాయిగా నిలిచింది. 2011 నుంచి డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తిరుగులేని కంచుకోటగా ఉన్న కొళత్తూరు నియోజకవర్గం నుంచి నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ అభ్యర్థిగా బాబు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బాబుకు 82,997 ఓట్లు రాగా, స్టాలిన్‌కు 74,202 ఓట్లు వచ్చాయి. దాదాపు 8,795 ఓట్ల మెజారిటీతో స్టాలిన్‌పై ఘన విజయం సాధించి తమిళనాడు రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద సంచలనం సృష్టించారు. వీఎస్ బాబు రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమైనది. ఆయన తన రాజకీయ జీవితాన్ని డీఎంకేతోనే ప్రారంభించారు. ఉత్తర చెన్నై జిల్లా డీఎంకే కార్యదర్శిగా పనిచేసిన ఆయన, 2006 నుంచి 2011 వరకు పురసవాక్కం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా సేవలందించారు. తదనంతర పరిణామాలతో డీఎంకేను వీడి 2016లో ఏఐఏడీఎంకేలో చేరారు. అనంతరం 2026 ఫిబ్రవరి 7న విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)లో చేరి, కొళత్తూరు స్థానం నుంచి పోటీ చేసి విజయకేతనం ఎగురవేశారు. వీఎస్ బాబు మరణం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధ్యక్షుడు విజయ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాబు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ కూడా వీఎస్ బాబు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాబు ఆకస్మిక మరణంతో కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయింది. ఒక ప్రభావవంతమైన సీనియర్ నేతను కోల్పోవడం టీవీకే వర్గాల్లో తీవ్ర శోకాన్ని నింపింది.

విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లపై సీఎం సమీక్ష

సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన ఆర్ అండ్ డీ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి క్లస్టర్లను బలోపేతం చేయడంతో పాటు ఈ రీజియన్‌లోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

తిరుపతి ప్రాంతానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, అందులో రూ.5.70 లక్షల కోట్లు కేవలం గ్రీన్ ఎనర్జీ రంగంలోనే నమోదయ్యాయని వివరించారు. రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగానికి సంబంధించి ప్రత్యేక మాగ్నెటిక్ క్లస్టర్, మూడేళ్ల లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్వాంటం హబ్‌గా అమరావతి

అమరావతి ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు ప్రధాన ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని, ప్రస్తుతం రూ.4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్ 'క్వాంటం కారిడార్'గా, క్వాంటం వ్యాలీ, క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం, రామాయపట్నం ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సూర్యలంక, పోర్టుల అనుసంధానంతో పాటు అమరావతి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాంత పురోగతికి కీలకంగా మారుతాయని పేర్కొన్నారు.ఎంఎస్ఎంఈల అనుసంధానం - నాలెడ్జ్ పార్టనర్లుభారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, సేవలు అందించేలా ఎంఎస్ఎంఈలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద విద్య, వైద్యం, నివాస సదుపాయాలతో కూడిన పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాల నుంచి విలువైన పదార్థాలను రీసైక్లింగ్ చేసే నూతన సాంకేతికతలపై దృష్టి పెట్టాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ఐఐటీ తిరుపతి, బిట్స్ పిలానీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించుకోవాలని, పాన్-ఐఐటీ నిపుణుల సేవలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

పర్యాటకానికి మాస్టర్ ప్లాన్

రాష్ట్రంలో పర్యాటకాన్ని లాభదాయక ఆర్థిక వనరుగా మార్చాలని సీఎం పిలుపునిచ్చారు. అరకు, లంబసింగి ప్రాంతాలకు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపరచాలని, సీఐఐ సదస్సు ప్రతినిధులను అక్కడికి తీసుకెళ్లేలా మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని, సూర్యలంకను వెంటనే నోటిపై చేయాలని ఆదేశించారు. ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి తీర ప్రాంతాలను పర్యావరణహిత బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దాలన్నారు. అమరావతి-నాగార్జునకొండలను అనుసంధానిస్తూ బౌద్ధ సర్క్యూట్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద ప్రతిపాదించిన రూ.9,180 కోట్ల విలువైన 60 ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, అభివృద్ధి ప్రణాళికల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కల్లూరు ఎంపీపీగా యుద్ధం శానగిరి అపర్ణ ప్రమాణ స్వీకారం

-ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ), ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ



స్వీకార కార్యక్రమం గురువారం అట్టహాసంగా, ఘనంగా జరిగింది. నూతన ఎంపీపీగా యుద్ధం శానగిరి అపర్ణతో పాటు ఇతర ఎంపీటీసీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డి విచ్చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన నూతన ఎంపీపీ యుద్ధం శానగిరి అపర్ణకు, ఎంపీటీసీ సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌరు వెంకట రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కల్లూరు మండల సమగ్రాభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఎంపీపీకి అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్య విలువలను అలవరచుకోవాలి

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలను అలవర్చుకుని, ఓటు హక్కు ప్రాముఖ్యతతో పాటు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల నమోదు అధికారి, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం కమిషనర్ చల్లా



ఓబులేసు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16న కర్నూలులోని కోల్స్ మెమోరియల్ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు గురువారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భావి ఓటర్లుగా ఉన్న విద్యార్థులు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. ఓటు హక్కు వినియోగంపై చైతన్యం పెంపొందించేందుకు పాఠశాల, కళాశాల స్థాయి నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. సంస్థాగత, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల ద్వారా విద్యార్థులకు ఓటర్ల జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటరు ధ్రువీకరణ పత్రాలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలపై అవగాహన కల్పించే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల నమోదు అధికారి, కర్నూలు అర్బన్ తహసీల్దార్ డి. రవికుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డబ్ల్యూ. ధనంజయ, పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, ఎన్నికల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టాయిలెట్ల పరిశుభ్రతతో ప్రజారోగ్య పరిరక్షణ

- నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : మరుగుదొడ్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్యాన్ని



పరిరక్షించవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ టాయిలెట్స్ డే సందర్భంగా కల్లూరు ఇందిరమ్మ కట్ట సమీపంలోని కురుబ గేరి మోడ్రన్ టాయిలెట్స్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించాలని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండి, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన పెంపొందించుకుని పారిశుధ్య ప్రమాణాలను పాటించాలని, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ జయన్న, తదితరులు పాల్గొన్నారు.


జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సన పి. నరసింహులు

☛రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ యువత పోరాడాలి: జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు

☛కులగణనతోనే సామాజిక న్యాయం: రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షుడు బెస్త శ్రీనివాసులు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మరింతగా రాణించాలని, రాజ్యాధికారమే లక్ష్యంగా యువత ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కర్నూలు నగరంలోని బి-క్యాంపు సమీపంలో గల బీసీ భవన్‌లో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గంలో 139 ఉపకులాలు ఉన్నాయని, అన్ని ఉపకులాల యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. సమస్త జీవన రంగాలను శాసించేది రాజ్యాధికారమేనని, జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రావాల్సిన వాటా కోసం పోరాడాలన్నారు. అనంతరం రజక సామాజిక వర్గానికి చెందిన సన పి. నేటికీ కొన్ని బీసీ ఉపకులాలు చట్టసభల్లో



నరసింహులుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందజేశారు.

కులగణనతోనే అసలైన న్యాయం:

జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బెస్త శ్రీనివాసులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, ఆయా కులాల జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాధికారంలో వాటాలు కల్పించినప్పుడే అసలైన సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా అడుగుపెట్టలేకపోవడం బాధాకరమన్నారు. బీసీల హక్కుల సాధన కోసం త్వరలోనే జిల్లా వ్యాప్తంగా గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు.


ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపేట రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి రామకృష్ణ, జిల్లా నాయకులు కుమ్మరి గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ చొరవతో లక్కందిన్నె వాసుల దాహార్తి తీరింది

☛వాట్సాప్ ఫిర్యాదుకు మూడు రోజుల్లోనే స్పందన.. కొత్త బోరు ఏర్పాటు

☛జె.సి నూరుల్ ఖమర్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపిన ప్రజా సంఘాల నేతలు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందిస్తే క్షేత్రస్థాయిలో అద్భుతాలు చేయవచ్చని కర్నూలు జాయింట్ కలెక్టర్ (జె.సి) నూరుల్ ఖమర్ నిరూపించారు. దేవనకొండ మండలం లక్కందిన్నె గ్రామంలో 45 రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను వాట్సాప్ ద్వారా ఆయన దృష్టికి తీసుకెళ్లిన కేవలం మూడు రోజుల్లోనే పరిష్కారమైంది. గ్రామంలో కొత్త బోరు వేయించి ప్రజలకు తాగునీరు అందించినందుకు కృతజ్ఞతగా గురువారం జె.సి ఛాంబర్‌లో రాయలసీమ యువజన, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు వి.వి. నాయుడు, రవికుమార్, మదాసికురువ సుంకన్న, పి.జి. వెంకటేష్ మాట్లాడుతూ.. అధికారుల వేగవంతమైన స్పందన ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగిస్తుందని ప్రశంసించారు. రహదారిపై ముళ్ల కంపల సమస్యపై వినతి:





అనంతరం లక్కందిన్నె గ్రామానికి సంబంధించిన ప్రయాణికులకు ముళ్లు గీసుకుపోయి గాయాలవుతున్నాయని, ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై ఇప్పటికే రెండుసార్లు పీజీఆర్ఎస్ (ఐ+ఎం) లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే ముళ్ల కంపలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు హరిగౌడ్, కురువ రమేష్, భరత్ కుమార్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణ ప్రతి రైతు బాధ్యత

☛ఆరుతడి పంటల సాగుతో అధిక లాభాలు

☛జిల్లా వనరుల కేంద్రం డిడిఏ చెన్నయ్య

☛డిసెంబర్ 15లోగా బీమా

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 19: బండి





ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో గురువారం ఆత్మ సౌజన్యంతో నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డిడిఏ చెన్నయ్య, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమగ్ర సస్యరక్షణ, రబీ పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డిడిఏ చెన్నయ్య మాట్లాడుతూ, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని పేర్కొన్నారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటుందని వివరించారు. సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పంటల సాగు, పంట మార్పిడి, పంట అవశేషాలను నేలలో కలపడం వంటి పద్ధతులను పాటించాలని సూచించారు. పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులు, నీటిని వినియోగించి వృథాను అరికట్టాలని రైతులకు సూచించారు.

జిల్లా వనరుల కేంద్రం ఏఓలు ప్రభావతమ్మ, వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వివిధ పంటల్లో చీడపీడల లక్షణాలను గుర్తించడం, నివారణ చర్యలు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వివరించారు. పంటలను నిరంతరం పరిశీలిస్తూ పురుగుల ఉధృతిని గుర్తించాలని, జీవ నియంత్రణ పద్ధతుల్లో భాగంగా పసుపు, నీలం రంగు జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలను వినియోగించాలని సూచించారు.

మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ రబీ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేసుకోవడానికి డిసెంబర్ 15 చివరి తేదీ అని తెలిపారు. రైతులు ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను వెల్లడించారు. శనగ రూ.84,జొన్న రూ.60,మినుము రూ.48,ఉల్లి రూ.90,వరి రూ.126,వేరుశనగ రూ.64,మామిడి రూ.2,250. రైతులు నిర్ణీత గడువులోగా ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలాగే రానున్న రబీ సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలైన జొన్న, కొర్ర, సజ్జలతో పాటు మినుము, పెసర, ఆవాలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటల సాగు రైతులకు మేలు చేస్తుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సునందన, లక్ష్మయ్య, వసుంధర తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు రుణాల విడుదల, రిజిస్ట్రేషన్,

మార్టిగేజ్ ప్రక్రియను త్వరితగతిన

పూర్తి చేయాలి



☛పూర్తయిన గృహాలను అన్ని సౌకర్యాలతో లబ్ధిదారులకు అప్పగించాలి

☛పెండింగ్ అంశాలపై 10 రోజుల్లో స్పష్టమైన పురోగతి చూపాలి

☛జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో టిడ్కో గృహాలకు సంబంధించి లబ్ధిదారులకు బ్యాంకు రుణాల విడుదల, మౌలిక వసతుల కల్పన,రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ ప్రక్రియలో ఉన్న పెండింగ్ అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించి, పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రానున్న 10 రోజుల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

గురువారం కలెక్టరేట్ లో మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకు అధికారులు, టిడ్కో, మెప్మా అధికారులతో టిడ్కో గృహాల నిర్మాణ పురోగతి, బ్యాంకు రుణాల విడుదల, ఎన్‌పీఏలు, రిజిస్ట్రేషన్, మార్టిగేజ్, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో టిడ్కో గృహాలకు సంబంధించి మొత్తం 6,999 గృహాలు లక్ష్యంగా ఉండగా, ఇప్పటివరకు 4,135 గృహాలకు సంబంధించి బ్యాంకు రుణాలు విడుదలయ్యాయని, ఇందులో 2,422 గృహాలకు పూర్తి స్థాయిలో, 1,493 గృహాలకు పాక్షికంగా రుణాలు విడుదలయ్యాయని తెలిపారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు రుణాలు విడుదలయ్యేలా బ్యాంకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి పెయింటింగ్, ఇంటర్నల్ ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ తదితర నిర్మాణ పనుల పూర్తిస్థాయి వివరాలను మున్సిపాలిటీల వారీగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల్లో తాగునీటి సరఫరా, అంతర్గత పైప్‌లైన్లు, విద్యుత్, వీధి దీపాలు, రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర మౌలిక వసతుల స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించారు. ఒక ప్రాంతంలో ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయినప్పటికీ, నిలువు పైప్‌లైన్లు, పంపింగ్ మోటార్ల ఏర్పాటు తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించగా, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

పూర్తి స్థాయిలో రుణాలు విడుదలైన గృహాల్లో ఇప్పటివరకు సుమారు 2,049 గృహాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని అధికారులు వివరించగా, మిగిలిన గృహాలకు కూడా రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి రోజుకు కనీసం 10 నుంచి 15 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. బ్యాంకులు, మెప్మా, మున్సిపల్, టిడ్కో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తయిన గృహాలను గుర్తించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలు అప్పగించినప్పటికీ నివాసం ఉండని లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు తమ గృహాల్లో నివాసం ఉండేందుకు అనుకూలమైన అన్ని సౌకర్యాలు కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

గత సమావేశంలో సూచించిన అంశాలపై సాధించిన పురోగతితో పాటు, ప్రతి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు, రుణాల విడుదల, ఎన్‌పీఏలు, మౌలిక వసతులు, రిజిస్ట్రేషన్, మార్టిగేజ్‌కు సంబంధించి వాస్తవ గణాంకాలతో కూడిన సమగ్ర నివేదికలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ అంశాలకు బాధ్యులైన అధికారులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, పూర్తి చేయాల్సిన గడువును నివేదికల్లో స్పష్టంగా పేర్కొనాలన్నారు. రానున్న 10 రోజుల్లో అన్ని అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపించాలని, తదుపరి సమీక్ష సమావేశం నాటికి పెండింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, టిడ్కో ఈఈ రవికుమార్ గుప్తా, ఎల్‌డీఎం మోహన్, మెప్మా పీడీ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్ గుప్తా, సి. ఎల్. టి. సి డాక్టర్ పెంచలయ్య, , బ్యాంక్ అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని, ఎమ్మిగనూరు, కమిషనర్లు పాల్గొన్నారు.

15 ఏళ్ల తర్వాత నంద్యాలలో దీని ఇస్తిమా.

☛డిసెంబర్ 17, 18 తేదీల్లో నిర్వహణ.

☛ఏర్పాట్లను పరిశీలించిన నంద్యాల జిల్లా ఇమాముల సంఘం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల సున్నీ మసీదు ఆవరణలో మూడు జిల్లాల పరిధిలో ఈ ఇస్తిమా నిర్వహించనున్నారు.

ఈ నేపథ్యంలో గురువారం నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాష సిద్ధికి ఆధ్వర్యంలో నాయకులు



పట్టణంలో 15 సంవత్సరాల తర్వాత దీని ఇస్తిమా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. డిసెంబర్ 17, 18 తేదీల్లో నంద్యాలలోని శాంతిరాం ఆసుపత్రి సమీపంలోని ఇస్తిమా నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇస్తిమా ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఇస్తిమాకు నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల నుంచి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఇస్తిమా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

15 సంవత్సరాల తర్వాత నంద్యాల పట్టణంలో దీని ఇస్తిమా నిర్వహించడం ఎంతో సంతోషకరమని, మూడు జిల్లాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇస్తిమాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇస్తిమా ఏర్పాట్లలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మౌలానా మహబూబ్ బాషా, హాఫిజ్ సలాం ,మూలాన ఫీ దా హుస్సేన్, మౌలానా అబ్దుల్లా, మౌలానా అబ్దుల్ కలాం, మౌలానా జబివుల్లా, హాఫిజ్ మౌలానా, మిరాజ్, హాఫిజ్ , సహబుద్దిన్,హాఫిజ్ అజం, హాఫిజ్ అబ్దుల్ రజాక్, హాఫిజ్ ఖాజా, హాఫిజ్ అలీ , హాఫిజ్ మజీద్, హాఫిజ్ ఫారూక్ , హాఫిజ్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 22 వ తేదీ జిల్లాస్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్.ఆర్.జి.చెస్ అకాడమీ నిర్వహణలో ఈనెల 22వ తేదీన నంద్యాల దేవ నగర్ లో ఉన్న రాహుల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు జిల్లా స్థాయి 4 వ ర్యాంకింగ్ చెస్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోటీల వివరాల కరపత్రాలను స్థానిక కళారాధన కార్యాలయంలో జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,కార్యదర్శి రామసుబ్బారెడ్డి,విశ్రాంత జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్,విశ్రాంత ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ కుమార్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ,రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరువేరుగా జరుగుతాయని తెలిపారు. టోర్నమెంట్ కోఆర్డినేటర్ గా రాహుల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ డి. వి. సుబ్బయ్య వ్యవహరిస్తారని అన్నారు. జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క క్యాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులు ఏపీ చెస్ వెబ్సైట్ ద్వారా ఈనెల 21 వ తేదీ సాయంత్రం లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010451585 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

బనగానపల్లె మండల అధ్యక్షురాలుగా గుండం మీనా కుమారి

బనగానపల్లె, నవంబర్ 19,పల్లెవెలుగు బనగానపల్లె మండల అధ్యక్షురాలుగా గుండం మీనా కుమారి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ పలుకూరు-1 ఎంపీటీసీ సభ్యురాలు గుండం మీనా కుమారితో మండల అధ్యక్షురాలుగా బనగానపల్లె-3 ఎంపీటీసీ సభ్యురాలు కే సునీర్ తో మండల ఉపాధ్యక్షురాలు గా ప్రమాణ స్వీకారం చేయించారు . టిడిపి ఎంపీటీసీ సభ్యులు పాతపాడు ఎంపీటీసీ సభ్యులు బెడదల మహేశ్వర రెడ్డి, బనగానపల్లె-1 ఎంపీటీసీ సభ్యులుగా బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి , బనగానపల్లె-6 సభ్యులుగా కొంగని విజయ్ కుమార్ యాదవ్, బనగానపల్లె - 8 ఎంపీటీసీ సభ్యులుగా జక్కుల రామాంజనేయులు, వైసీపీ ఎంపీటీసీ సభ్యులు నందవరం-1 ఈడిగ చంద్రశేఖర్ గౌడ్, బనగానపల్లె -7 ఎన్ఎస్ రహిమాన్ లతో పాటు మిగతా ఎంపీటీసీ సభ్యులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. బనగానపల్లె మండల అధ్యక్షురాలిగా గుండం మీనా కుమారి ప్రమాణ స్వీకారం-

బనగానపల్లె మండల పరిషత్ అధ్యక్షురాలిగా పలుకూరు--1 ఎంపీటీసీ సభ్యురాలు గుండం మీనా కుమారి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ ఆమెకు పదవీ బాధ్యతలు అప్పగించారు.





ఉపాధ్యక్షురాలిగా కే. సునీర్- బనగానపల్లె--3 ఎంపీటీసీ సభ్యురాలు కేకే. సునీర్‌లి మండల ఉపాధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. రిటర్నింగ్ అధికారి సుధాకర్ ప్రమాణం చేయించారు. బనగానపల్లె మండలంలో 29 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవంగా నిర్ణయమయ్యాయి. 19 ఎంపీటీసీ స్థానాలు టీడీపీకి పది ఎంపిటిసి స్థానాలు వైసీపీకి ఏకగ్రీవం అయ్యాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన గుండా మీనా కుమారి మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు.మండలంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, రోడ్లు, పాఠశాలలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఘనంగా 109 జయంతి వేడుకలు.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశనికి ఆమె 17సవచరలు దేశ ప్రధిగా అనేక ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి, బ్యాంకులు జాతీయం చేసిన ఘనత ఉక్కు మహిళా గా పేరు తెచ్చుకున్న మొదట మహిళా గా కొనియాడారు. 20సూత్రాలు అమలు చేసి పెద్ద వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చిన వారితండ్రి మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వెంట అనేక సార్లు జైలు శిక్ష అనుభవం ఉంచి స్వతంత్ర భారతదేశంనికి స్వతంత్రం కోసం పాటుపడారని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, మాజీ అధికార ప్రతినిధి ఉకోటు వాసు, రత్న మాయ, చెన్న కేశవరావు మొదలగు వారు పాల్గొన్నారు.



గుంతలకు తారు వేసిన ఆర్ అండ్ బీ అధికారులు

హోళగుంద పల్లె వెలుగు నవంబర్:19మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలోని గజ్జహల్లి-



-ఆదోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో స్పందించిన ఆర్ అండ్ బీ అధికారులు తమ శాఖ ఆధ్వర్యంలో రహదారిపై ఏర్పడిన గుంతలకు తారు వేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులకు కొంతమేర ఇబ్బందులు తొలగనున్నాయి.

నంద్యాల మండలం ఎంపీపీగా ఎం శివ లలిత ప్రమాణ స్వీకారం.

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎం శివ





లలిత , వైస్ ఎంపీపీగా దేరెడ్డి బాలచంద్రారెడ్డి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుగుణ శ్రీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ లకు శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ,వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, నంద్యాల వైసిపి మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి , వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

గోస్పాడు ఎంపీపీగా పీపీ జగదీశ్వరమ్మ ప్రమాణ స్వీకారం..

- కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా గోస్పాడు మండల పరిషత్



అధ్యక్షురాలిగా పీపీ జగదీశ్వరమ్మ, వైస్ ఎంపీపీగా మక్బూల్ బాషా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ సీఈసీ మెంబర్ పీపీ నాగిరెడ్డి, వైసీపీ శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకులు పీపీ మధుసూదన్ రెడ్డి, పీపీ జనార్దన్ రెడ్డి, వైసీపీ లీగల్ సెల్ నాయకులు వివేకానంద రెడ్డి, మాజీ ఎంపీపీ ఆర్థర్ సైమన్, వైసీపీ నాయకులు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మహిళా దినోత్సవం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 19: 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 6 రోజు గ్రంధాల అధికారి ఎం రవిరాజు ఆధ్వర్యంలో కే.జీ.బీ.వీ. నందు గురువారం మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కీర్తిశేషులు ఇందిరాగాంధీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ భవాని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్. భవాని మాట్లాడుతూ తొలి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సేవలుగురించి విద్యార్థినిలకు వివరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా టీచర్స్ కి క్రీడా పోటీలు నిర్వహించడం జరిగినది. క్రీడలలో పాల్గొన్న మహిళా టీచర్లకు గ్రంథాలయాధికారి రవిరాజు బహుమతులను అందజేశారు.

సర్పంచ్ బరిలో ఫేస్ బుక్ స్టార్ కుద్దూస్ నామినేషన్

-11 హామీలతో ప్రజల ముందుకు -సందడి చేయనున్న యూట్యూబర్లు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 19: గ్రామాభివృద్ధి కోసం తన సొంతంగా నిధులను







బండి ఆత్మకూరులో గ్రామ సర్పంచ్ పదవికి ఫేస్బుక్ స్టార్ కుద్దూస్ గురువారం తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారులకు సమర్పించారు. బండి ఆత్మకూరు గ్రామానికి కుద్దూస్ ఫేస్బుక్ స్టార్ గా గుర్తింపు పొందారు. ఆశాను ప్రేమించి వివాహం చేసుకున్న నాటినుండి కుద్దూస్ యూట్యూబ్ లో త న కార్యక్రమాలను కొనసాగిస్తున్నాడు.గ్రామంలో గత 30 సంవత్సరాలుగా పీర్ల పండగకు నోచుకోని సందర్భంలో కుద్దూస్ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి గ్రామంలో పీర్ల పండగ జరిగేందుకు కృషి చేశాడు. గ్రామంలో అభివృద్ధి పనులు చేసేందుకు తనకు ఒక అవకాశం ఇవ్వాలని కుద్దూస్ ప్రజలను అభ్యర్థిస్తున్నాడు. ఎలాంటి స్వార్థం లేకుండా ఖర్చు చేస్తానని ప్రజలకు ఏకంగా 11 హామీలు ఇస్తున్నాడు. గ్రామంలో అన్ని కులాలకు సంబంధించి ఆలయాలు మసీదులు చర్చిల అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతున్నాడు.

ముస్లింలు హిందువులు క్రిస్టియన్ల స్మశాన వాటికల అభివృద్ధికి ప్రయత్నం చేస్తానని అంటున్నాడు. గ్రామంలో గత 30 సంవత్సరాలుగా బస్టాండ్ లేక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో చర్యలు తీసుకొని ప్రజల కొరకు బస్టాండ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నాడు. ముస్లిం సోదరులకు ఈద్గా వద్ద కాంపౌండ్ నిర్మాణం చేపడుతానని పేర్కొంటున్నాడు. యువత కు విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడా మైదానం ఏర్పాటు చేస్తానని పేర్కొంటున్నాడు. రజకుల కోసం ప్రత్యేకంగా దోబిగాట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామాలలో ప్రతి పేదింటి ఆడపిల్లకు కులమతాలకు అతీతంగా పెళ్లి కానుకగా 5000 రూపాయలు ఇస్తానని హామీ ఇస్తున్నాడు. గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పారదర్శకంగా ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించి అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నాడు. గ్రామాలలో ఎవరైనా మరణిస్తే ఇందుకు సంబంధించి శవాన్ని భద్రపరిచేందుకు ప్రత్యేకంగా శవపేటిక ఏర్పాటు చేయిస్తానని హామీ ఇస్తున్నాడు. హిందూ సోదరుల కోసం ప్రత్యేకంగా అంత్యక్రియలకు గాను ప్రత్యేకంగా అంత్యక్రియల రథం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ప్రత్యేకంగా హామీ ఇస్తున్నాడు. గ్రామంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తనకు సంబంధాలు ఉన్నాయని వారు కూడా తనకు మద్దతు తెలిపే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.గ్రామాలలో ప్రజాసేవ చేసేందుకు 11 హామీలతో ముందుకు వస్తున్నానని ప్రజలు తనను గ్రామ సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చెబుతానని కుద్దూస్ చెబుతున్నాడు. కుద్దూస్ ఇచ్చిన హామీల పట్ల ప్రజలు ఏమాత్రం స్పందిస్తారో అన్న విషయానికి ఈనెల 29వ తేదీన జరిగే ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే!

సందడి చేయనున్న యూట్యూ బర్లు

బండి ఆత్మకూరు సర్పంచ్ గా నామినేషన్ వేసిన కుద్దూస్ కు మద్దతుగా యూట్యూబ్లో సందడి చేయనున్నారు. ఫేస్బుక్ స్టార్ గా గుర్తింపు పొందిన కుద్దూస్ హైదరాబాదులో యూట్యూ బర్ల తో సన్నిహితసంబంధాలు పెంచుకున్నారు. కుద్దూస్ కు మద్దతుగా యూట్యూబర్లు ఉప్పల బాలు, వైజాగ్ సత్య ,గుంటి నాగరాజు, కొరియోగ్రాఫర్ బషీర్ ,వరంగల్ శేఖర్ ,దివంగత కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్ సతీమణి కనక మహాలక్ష్మి తదితరులు ఈనెల 25 నుండి బండి ఆత్మకూరులో కుద్దూస్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం లో గ్రామంలో సందడి చేయనున్నారు. భార్య ఆశా తో పాటు యూట్యూ బర్ల తో గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కుద్దూస్ ప్రయత్నాలు ఫలించాలని ఆశిద్దాం!

ఫ్రీహోల్డ్ భూముల సమస్యల పరిష్కార ప్రక్రియ, రీ--సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి.

పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి.

-జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల సమస్యల పరిష్కార ప్రక్రియ, రీ--సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఫ్రీహోల్డ్ భూముల సమస్యల పరిష్కారం, రీ సర్వే తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్టీవోలు, తాసిల్దారులు, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, డీఐలు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఫ్రీహోల్డ్ భూముల సమస్యల పరిష్కారం, రీ--సర్వేకు సంబంధించిన పెండింగ్ పనులు, 5వ విడత , 6 వ విడత రీ--సర్వేలో డి ఎల్ ఆర్ పనుల పురోగతి తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. నిర్ణీత గడువు లోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి అని, మండలాల వారీగా పెండింగ్ పనులను గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైస్ ఛైర్మన్‌పై ఉత్కంఠ.

28--28తో సమబలం.. లాటరీతోనే తుది తీర్పు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మున్సిపాలిటీలో వైస్ ఛైర్మన్ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి, వైఎస్సార్‌సీపీ మధ్య చెరో 28 ఓట్లతో సమాన బలం ఏర్పడే అవకాశం ఉందని మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ శివప్రసాద్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు.

మున్సిపాలిటీలోని 52 మంది వార్డు కౌన్సిలర్లతో పాటు నేరుగా ఎన్నికైన ఛైర్‌పర్సన్, అర్హత కలిగిన ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓట్లను కలిపి మొత్తం 56 ఓట్లు ఉంటాయని తెలిపారు. ఇందులో టీడీపీకి చెందిన 24 మంది కౌన్సిలర్లు, ఒక బీజేపీ కౌన్సిలర్, టీడీపీ ఛైర్‌పర్సన్, ఇద్దరు ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి ఎన్డీఏ కూటమికి 28 ఓట్లు వస్తాయని వివరించారు. మరోవైపు వైఎస్సార్‌సీపీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫీషియో సభ్యుడితో కలిపి ఆ పార్టీకి కూడా 28 ఓట్లు ఉంటాయని పేర్కొన్నారు.

ఓటు హక్కుకు అర్హత తప్పనిసరి-



ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నంద్యాల మున్సిపల్ పరిధిలో ఓటర్లుగా నమోదై ఉండటంతో పాటు, ఎన్నికల అధికారికి తమ ఓటు హక్కు వినియోగంపై నిర్ణీత ఆప్షన్‌ను సమర్పించినప్పుడే ఎక్స్‌అఫీషియో ఓటు హక్కు లభిస్తుందని స్పష్టం చేశారు.

సమాన ఓట్లొస్తే లాటరీ-

వైస్ ఛైర్మన్ ఎన్నికలో ఇరు పక్షాలకు సమానంగా 28 ఓట్లు వస్తే ఛైర్‌పర్సన్‌కు అదనపు నిర్ణయాత్మక ఓటు ఉండదని తెలిపారు. ఎవరూ గైర్హాజరు కాకుండా, క్రాస్ ఓటింగ్ జరగకుండా ఓట్లు సమానంగా నమోదైతే నిబంధనల ప్రకారం డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా విజేతను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు.

దీంతో నంద్యాల మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

మండల ప్రజా పరిషత్ ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం

● 25 ఎంపీపీ స్థానాలకు గాను 24 చోట్ల తెలుగుదేశం జయకేతనం ● కోడుమూరులో వైసీపీ-సీపీఐ(ఎం) కూటమి విజయం ● మంత్రాలయం ఎన్నిక నేటికి వాయిదా

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు గురువారం జరిగిన పరోక్ష ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం 26 మండలాలకు గాను 25 స్థానాల్లో అధ్యక్ష ఎన్నికలు జరగగా, అందులో ఏకంగా 24 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక్క కోడుమూరు మండలంలో మాత్రమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధ్యక్ష పీఠాన్ని దక్కించుకుంది. మంత్రాలయం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు శుక్రవారం (20-11-2026) ఉదయం 11 గంటలకు వాయిదా పడ్డాయి. అలాగే సి.బెళగల్, గూడూరు మండలాల్లో ఉపాధ్యక్ష ఎన్నికలను కూడా అధికారులు రేపటికి వాయిదా వేశారు.

మండలాల వారీగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు:

ఆదోని – 1: అధ్యక్షురాలిగా కురువ పీడ లక్ష్మి (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా ఇ.వి. రాముడు (టీడీపీ).

ఆదోని – 2: అధ్యక్షురాలిగా ఎల్. సులోచన (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా షహీనా బేగం (టీడీపీ).

ఆలూరు: అధ్యక్షుడిగా వైకుంఠం సాయి శ్రీరామ్ (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా కె. నాగవేణి (టీడీపీ).

ఆస్పరి: అధ్యక్షుడిగా ఎం. కృష్ణ (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా చెన్నంపల్లి పద్మావతి (టీడీపీ).

సి.బెళగల్: అధ్యక్షురాలిగా మల్లెపోగు అరుణ కుమారి (టీడీపీ) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష ఎన్నిక 20-11-2026 ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

చిప్పగిరి: అధ్యక్షుడిగా ఈరగందుల మీనాక్షి నాయుడు (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా ఉనెబడి



గోవింద రాజులు (టీడీపీ).

దేవనకొండ: అధ్యక్షురాలిగా ఈడిగ లక్ష్మి (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా ఎ. వీరేష్ (టీడీపీ).

గోనెగండ్ల: అధ్యక్షురాలిగా నందవరం మౌనిక (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా అచ్చుగట్ల ఫకృద్దీన్ (టీడీపీ).

గూడూరు: అధ్యక్షుడిగా కుందం రాణా ప్రతాప్ రెడ్డి (టీడీపీ) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష ఎన్నిక 20-11-2026 ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

హాలహర్వి: అధ్యక్షురాలిగా గుమ్మనూరు గిరిజమ్మ (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా సూరి నరసన్న (టీడీపీ).

హోళగుంద: అధ్యక్షురాలిగా బోయ జయలక్ష్మి (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా ఎం. రమేష్ (టీడీపీ).

కల్లూరు: అధ్యక్షురాలిగా శనగిరి అపర్ణ (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా కోడెల సుదర్శనం (టీడీపీ).

కోడుమూరు: అధ్యక్షుడిగా బరుసు రఘునాథ (వైసీపీ), ఉపాధ్యక్షుడిగా నేసే నాగిరెడ్డి ఉరఫ్ కనికె (సీపీఐ-ఎం).

కోసిగి: అధ్యక్షురాలిగా పైంటి రాధమ్మ (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా కిందిగేరి గోపాల్ (టీడీపీ).

కౌతాళం: అధ్యక్షురాలిగా వల్లూరు సురేఖ (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా సులేకేరి లక్ష్మి (టీడీపీ).

కృష్ణగిరి: అధ్యక్షురాలిగా ఎన్. నాగులు (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా గుమ్మకొండ వెంకటేశ్వర్లు (టీడీపీ).

కర్నూలు: అధ్యక్షురాలిగా మాదిగ సాలమ్మ (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా నాగరాజు అశ్విని (టీడీపీ).

మద్దికెర: అధ్యక్షుడిగా దబ్బర ఎర్రిస్వామి (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా ఆవుల పెద్దన్న (టీడీపీ).

మంత్రాలయం: అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు 20-11-2026 ఉదయం 11 గంటలకు వాయిదా పడ్డాయి.

నందవరం: అధ్యక్షుడిగా మల్లెపోగు చార్లెస్ (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా గొల్ల రాధమ్మ (టీడీపీ).

ఓర్వకల్లు: అధ్యక్షురాలిగా పుష్పలలిత మద్దిరెడ్డి (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా రషీదా బీ (టీడీపీ).

పత్తికొండ: అధ్యక్షురాలిగా మంజులవాణి బత్తిని (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా చెక్క శిల్పా శెట్టి (టీడీపీ).

పెద్దకడబూరు: అధ్యక్షురాలిగా గవిగట్టు ప్రవీణ (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా ఎం. రామాంజనేయులు (టీడీపీ).

తుగ్గలి: అధ్యక్షురాలిగా కె. వరలక్ష్మి (టీడీపీ), ఉపాధ్యక్షుడిగా పొన్నసురు వెంకటపతి (టీడీపీ).

వెల్దుర్తి: అధ్యక్షుడిగా తొల్ల మద్దిలేటి (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా కొమ్ము యమున (టీడీపీ).

ఎమ్మిగనూరు: అధ్యక్షురాలిగా కె. పుష్పావతి (టీడీపీ), ఉపాధ్యక్షురాలిగా షేక్ రసూల్ బీ (టీడీపీ).

బారీ జనసమూహం మధ్య హటహసంగా నామినేషన్లు

-కంపమల్ల సర్పంచ్ బరిలో టిడిపి పార్టీ సూరా సుస్మిత్ రెడ్డి

-గ్రామంలోని ప్రతి వీధి సమస్యపై అవగాహన..

ప్రజలకు అందుబాటులో ఉండే

నాయకుడిసూరాసురేష్ రెడ్డి సతీమణి సుస్మిత్ రెడ్డి

బనగానపల్లె, నవంబర్ 19,పల్లెవెలుగు కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో టిడిపి పార్టీ నాయకుడు సూరా సురేష్ రెడ్డి సతీమణి సూరా సుస్మిత్ రెడ్డి నిలిచారు గ్రామంలోని ప్రతి ప్రాంతం, ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగిన వ్యక్తిగా ఆయనకు స్థానికంగా గుర్తింపు ఉంది.

గ్రామంలో ఎక్కడ రోడ్డు సమస్య ఉంది? ఏ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది? ఏ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి? ఎక్కడ వీధిలైట్లు పనిచేయడం లేదు? ఏ ప్రాంతంలో విద్యుత్ లీకేజీ సమస్య ఉంది? ఎక్కడ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం అదూకోవడంలో ముందుడి వ్యక్తులుగా మంచి పేరున్న కుటుంబం గ్రామంలో ప్రతి సమస్య పరిస్కరించి కృషి చేయాలనే ఆలోచనతో భార్య భర్తలు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. కంపమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని కాలనీలకు సమాన ప్రాధాన్యత కల్పించడం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ, వీధిలైట్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే తన



ఉంది? అనే అంశాలపై సుస్మిత్ రెడ్డి భర్త కు స్పష్టమైన అవగాహన ఉందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పెండ్లింద్లు సుభకార్యాలుకుగాని లక్ష్యంగా ముందుకు సాగాలని భావిస్తున్నట్లు సమాచారం. గ్రామంలోని ప్రతి వీధి సమస్యపై అవగాహన ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందిన సూరా సురేష్ రెడ్డి సతీమణికి . సర్పంచ్‌గా అవకాశం వస్తే కంపమల్ల అభివృద్ధికి ఎలాంటి మార్పులు తీసుకొస్తారో వేచి చూడాలి!

ఆదోని నియోజకవర్గంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు ఏకగ్రీవం.

టీడీపీ ఆధ్వర్యంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ..

నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గంలో సజావుగా, ఏకగ్రీవంగా పూర్తయింది. తెలుగుదేశం పార్టీ తరఫున ఆదోని మండలం-1, ఆదోని మండలం-2లకు సంబంధించి ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికైన సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ గురువారం ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షి నాయుడు మార్గదర్శకత్వంలో, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు సహకారంతో ఎన్నికల ప్రక్రియ ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఏకగ్రీవంగా పూర్తయిందని పార్టీ నాయకులు తెలిపారు.నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తవడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

ఎంపీపీ పదవులకు ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైసీపీ ఎంపీటీసీలు సన్మానించిన వైసీపీ నాయకులు

దొర్నిపాడు నవంబర్ 19 పల్లె వెలుగు న్యూస్ ఎంపిటిసిలుగాఎన్నికై ఎంపీడీవో కార్యాలయం నందు గురువారం ఎన్నికల అధికారి నాగరాజు ఎంపీడీవో,సావిత్రుల సమక్షంలోప్రమాణం శ్రీకారం చేసిన వైసిపి ఎంపీటీసీలను మండల వైసీపీ నాయకులు భూమాచెంచిరెడ్డిఆధ్వర్యంలోవారికిపూలమాలవేసి ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు భూమా చెంచిరెడ్డి మాట్లాడుతూ మీ మీదనమ్మకంతోమీకుఓట్లువేసిగెలిపించారన్నారు,ఎ ారినమ్మకాన్ని ఉమ్ముచేయకుండామీబాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఆయన వారిని



కోరారు, ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మోహన్ నాయుడు చంద్రశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

అట్టహాసంగా ఎంపీపీ ఎంపీటీసీల ప్రమాణ స్వీకారంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండల మండల ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు -- 2026



నంద్యాల జిల్లా పరిధిలోని మండల ప్రజా పరిషత్‌లకు సంబంధించి 2026 సంవత్సరానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ప్రమాణస్వీకారంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి సమక్షంలో మండల నాయకుల, అధికారులు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

గడివేముల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా శ్రీమతి వల్లపురెడ్డి అనసూయమ్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా యర్రగుంట్ల హర్షవర్ధన్ ఎన్నికయ్యారు.

ఈ ఎన్నికల ద్వారా మండల ప్రజా పరిషత్ పాలనలో నూతన బాధ్యతలు స్వీకరించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ వెంకటరమణ ఎంపీడీవో వాసుదేవ గుప్తా డిప్యూటీ ఎంపీడీవో మహేందర్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు మంచాలకట్ట శ్రీనివాస్ రెడ్డి, మండల టిడిపి సీనియర్ నాయకులు బిడుదురు సీతారాం రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు దేశం సత్యనారాయణరెడ్డి స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, టిడిపి అభ్యర్థులు మండల నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల శాఖ గ్రంధాలయం నందు 59వ జాతీయ



గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రంధాలయాధికారి వి. వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీమతి ఇందిరా గాంధీ జవహర్లాల్ నెహ్రూ కూతురు న్ హతావో" నినాదంతో పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. లి నాయకత్వం మరియు పరిపాలన: 1966 జనవరి 24న ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి సుమారు 16 సంవత్సరాల పాటు దేశాన్ని నడిపించారు. లి భారతరత్న: దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా 1972లో భారతరత్న పురస్కారం అందుకున్నారు. లి నేటి జయంతి స్మరణ: నవంబర్ 19న ఆమె జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నేతలు ఆమె సేవలను స్మరించుకుంటున్నారు. ఈమెకు ఉక్కు మహిళ అని పేరు వచ్చింది.దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన ఉక్కు మహిళ.ఇందిరా గాంధీ చేసిన సేవలు ప్రధానిగా ఆమె తీసుకున్న శాశ్వతమైన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి స్కూల్ స్టాఫ్ మరియు గ్రంథాలయ పాఠకులు , విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంపీపీకి టిడిపి నాయకుల అభినందనలు

దొర్నిపాడునవంబర్ 19 పల్లె వెలుగు న్యూస్ స్థానికఎంపీటీసీఎన్నికల్లోరామచంద్రాపురం



ఎంపీటీసీగా గెలుపొంది మండల అధ్యక్షులుగ ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు చేపట్టినపాదం సుస్మితను దొర్నిపాడు మండల లోని కొండాపురం గ్రామ టిడిపి యువ నాయకులుచవ్వాశివారెడ్డి ,విజయసింహారెడ్డిలు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అధ్యక్షులుగా బాధ్యతలుచేపట్టినపాదంసుస్మిత ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాలతో టీడీపీ పార్టీ బలోపేతానికి ఎంపీపీ కి,మావంతుసహకారం అందిస్తామన్నారు, దొర్నిపాడు మండలంలోని11గ్రామపంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు ఈనెల 26వ తేదీన జరగబోయే సర్పంచ్ ఎన్నికలలో టిడిపి అభ్యర్థుల విజయానికి కృషిచేసి అందరి సహకారంతో మండలంలో టిడిపి జెండా ఎగురవేయాలి అని వారు అన్నారు ,ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ఈర్నపాడు క్లస్టర్ లో 51 నామినేషన్లు



బండి ఆత్మకూరు పల్లెవెలుగు నవంబర్ 19: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు క్లస్టర్ లో గురువారం పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్లకు సంబంధించి 51 నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి ఆబుదూర్ రాసి పేర్కొన్నారు. ఈర్నపాడులో సర్పంచ్ పదవులకు నాలుగు నామినేషన్లు, 13 వార్డు సభ్యులకు నామినేషన్ లు అభ్యర్థులు సమర్పించారని పేర్కొన్నారు. కడమల కాల్వ పంచాయతీ సర్పంచుకు ఐదు నామినేషన్లు, వార్డు సభ్యులకు 17 నామినేషన్లు వచ్చాయని, వెంగల్ రెడ్డి పేట సర్పంచ్ పదవికి ఒక నామినేషన్ వేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈర్నపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పిట్టం పెద్ద రామ సుబ్బారెడ్డి నామినేషన్ను సమర్పించారు.

ఏకగ్రీవంగాఎన్నికైన ఎంపీపీ ఉపాధ్యక్షులతో టిడిపి నాయకులు

దొర్నిపాడు నవంబర్ 19 పల్లె వెలుగు న్యూస్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం



నందు గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగరాజు, ఎంపీడీవో సావిత్రిల సమక్షంలోజరిగినమండలఅధ్యక్షులు ఉపాధ్యక్షుల ఎన్నిక కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నికైమండల అధ్యక్షులు ఉపాధ్యక్షులుగబాధ్యతలు చేపట్టిన పాదం సుస్మిత, ఉపాధ్యక్షురాలు నందగారి సరస్వతి, టిడిపి ఎంపీటీసీ జడ్పిటిసి అభ్యర్థిని కేదాటి పార్వతి లను మండల టిడిపి నాయకులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు మీ మీద నమ్మకంతో మిమ్మల్ని గెలిపించి బాధ్యతలనుఅప్పజెప్పారు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, సత్యం, సురేంద్ర, వెంకటస్వామి,నారాయణ మహేశ్వర్ రెడ్డి, బాలస్వామి కృష్ణారెడ్డి,భూపనపాటిశేఖర్ శ్రీనివాసరావు, మల్లికార్జున, రఘురాముడు, పాదం శీను, నాయన గారి శ్రీనివాసులు, హుసేని ,బుజ్జి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

బనగానపల్లె సర్పంచ్ అభ్యర్థిగా బీసీ ఇందిరా రెడ్డి నామినేషన్

బనగానపల్లె, నవంబర్ 19, పల్లెవెలుగు బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి, టిడిపి నియోజకవర్గ నాయకురాలు



బీసీ ఇందిరా రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుభాషిణికి అందజేశారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి టిడిపి నాయకులు బీసీ రామనాథరెడ్డి బిసి మనోహర్ రెడ్డిలతో కలిసి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారి సుభాషిణికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పంచాయతీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, మౌలిక వసతుల కల్పనతో పాటు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. బనగానపల్లె పట్టణ ప్రజలు అభివృద్ధికి పట్టణ కట్టాలన్నారు. అభివృద్ధి చేసే వారిని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు షేక్ బురానుద్దీన్, టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, భానుముక్కల సహకార సంఘం అధ్యక్షులు అత్తార్ అబ్దుల్ కలాం, టిడిపి నాయకులు బీసీ బాల తిమ్మారెడ్డి, రాయలసీమ సలాం, అత్తార్ అను, హర్షద్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



బనగానపల్లె, నవంబర్ 19, పల్లెవెలుగు పట్టణంలోని గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా 6వ రోజు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 109 వ జయంతి సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది అరుణ గీతామని ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ గీతామని మాట్లాడుతూ భారత దేశంలోఇందిరా గాంధీ మొట్టమొదటి మహిళ ప్రధానమంత్రిగా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై కమిషనర్ ప్రత్యేక దృష్టి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న కలెక్టరేట్‌లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు.

అనంతరం నంద్యాల పట్టణంలోని శ్యామ్ నగర్ 38వ వార్డును సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలు, వార్డులోని సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని, గుర్తించిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏ కోడూరులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా మన్నె సరిత నామినేషన్

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 19: బండి ఆత్మకూరు మండల



పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామపంచాయతీకి సర్పంచ్ అభ్యర్థిగా మన్నె సరిత గురువారం నామినేషన్ను దాఖలు చేశారు. ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావుకు నామినేషన్ సమర్పించారు. ఏ కోడూరు గ్రామపంచాయతీ రిజర్వేషన్ లో జనరల్ కు కేటాయించడం జరిగింది. మన్నె సరిత మామ మన్నె జ్ఞానాభరణం 2021 సంవత్సరంలో సర్పంచ్ గా గెలుపొంది గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. మన్నే సరిత కూడా విద్యావంతురాలు కావడంతో పాటు, సర్పంచ్ పదవికి నామినేషన్ వేయడంతో గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు విస్తు పోతున్నారు .

ఆదోని మండలం-1, మండలం-2లో నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం.

-ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలకు అభినందనలు తెలిపిన గుడిసె ఆది కృష్ణమ్మ, ఎమ్మెల్యే పార్థసారథి.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదోని మండలం-1 ఎంపీపీగా కె. పెద్దలక్ష్మి, ఆదోని మండలం-2 ఎంపీపీగా సులోచనమ్మతో పాటు నూతనంగా ఎన్నికైన వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి హాజరై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి నూతన ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని అన్నారు. ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, గ్రామాల అభివృద్ధిలో క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, కొంకా ఉమాపతి నాయుడు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, మండల అధ్యక్షుడు శివప్ప, శ్రీకాంత్ రెడ్డి, బసాపురం రామస్వామి, గోపాల్ రెడ్డి, దిబ్బనకల్ లక్ష్మన్న, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహానంది మండల అధ్యక్షులుగా బుడ్డారెడ్డి శ్రీనివాస రెడ్డి

మహానంది, పల్లె వెలుగు మహానంది మండల పరిషత్ అధ్యక్షులుగా



తెలుగుదేశం పార్టీకి చెందిన గాజులపల్లె-1 ఎంపీటీసీ బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షురాలుగా తిమ్మాపురం-1 ఎంపీటీసీ ఉల్లి మధుమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మహానంది మండలం తిమ్మాపురం ఎంపీడీవో కార్యాల యంలో జిల్లా స్వర్ణగ్రామ, వార్డు అధికారిణి లలితా బాయి ఎన్నికల నిబంధనల ప్రకారం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తెలుగుదేశం పార్టీకి చెందిన మరో ఐదు మంది ఎంపీటీసీల్లో బుక్కాపురం బుడ్డారెడ్డి యశస్విని, తిమ్మాపురం-2 నందిమల్ల వెంకట సుబ్బమ్మ, బొల్లవరం షేక్ నిమ్మచెట్ల మదార్ వలి, మసీదుపురం ఆవుల సుబ్బలక్ష్మమ్మ, సీతారామాపురం పెరుమాళ్ల శివకేశవరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ దౌల, డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత,ఎంఈవో రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

నందవరం గ్రామ అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం,,,,

-సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన దేశాయ్ పరిమళ,,,,,

నందవరం పల్లె వెలుగు నవంబర్ 19నందవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా





ఈరోజు పరిమళ దేశాయ్ (భర్త దేశాయ్ మాధవరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. నందవరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయడానికి గ్రామంలో త్రాగునీటి సమస్య, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ నందవరం అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల ఆశీర్వాదం మరియు సహకారం కోరుకుంటున్నానని దేశాయ్ పరిమళ తెలిపారు.

సీతారామపురంలో చోరీ

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం సీతారామాపురం



గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ ఎల్.శివాంజల్ పేర్కొన్నారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. సీతారామపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ళ ప్రమీల అనే మహిళ ఇంట్లోని ట్రంకు పెట్టెను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకొని వెళ్లారన్నారు. ఆ ట్రంకు పెట్టేలో రూ.50 వేల నగదుతో పాటు లక్ష రూపాయలు విలువ చేసే పాత బంగారు నగలు ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

బనగానపల్లెలో భారీగా నామినేషన్లు

బనగానపల్లె, నవంబర్ 19, పల్లెవెలుగు బనగానపల్లె మండలం లో రెండవ రోజు నామినేషన్లు భారీగా దాఖలు చేశారు. గురువారం రెండవ రోజు నాలుగు 54 నామినేషన్లు వార్డు సభ్యుల స్థానానికి 229 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. పాతపాడు గ్రామ సచివాలయంలో పసుపల సర్పంచ్ గా సన్నల సుమలత నామినేషన్ల పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శిరీషకు అందజేశారు. పాతపాడు సర్పంచ్ గా బెడదల పద్మావతి నామినేషన్ల పత్రాలను ఎన్నికల అధికారి శిరీష అందజేశారు. నందవరం సర్పంచ్ గా పి.ఆర్. రమణారెడ్డి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి సుందరయ్యకు అందజేశారు.





బనగానపల్లె సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు, వార్డు సభ్యులుగా 29 మంది, యాగంటిపల్లె సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్, వార్డుకు ఒక నామినేషన్, యనకండ్ల సర్పంచ్ స్థానానికి రెండు, వార్డుకు ఒకటి , మీరాపురం సర్పంచ్ స్థానానికి రెండు, వార్డులకు ఏడు, ఎర్రగుడి సర్పంచ్ స్థానానికి రెండు, టంగుటూరు సర్పంచ్ స్థానానికి ఒకటి ,వార్డులకు 10 అప్పలాపురం సర్పంచ్ స్థానానికి మూడు, వార్డుకు 11 ,కైప సర్పంచ్ స్థానానికి రెండు, వార్డులకు 13 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. పాతపాడు సర్పంచ్ స్థానానికి రెండు ,వార్డుకు ఒకటి, పసుపల సర్పంచ్ స్థానానికి, రెండు వార్డులకు 23 ,కృష్ణగిరి సర్పంచ్ స్థానానికి నాలుగు ,వార్డులకు మూడు, గులాం అలియాబాద్ తాండ సర్పంచ్ స్థానానికి మూడు, వార్డుకు ఒకటి ,ఇల్లూరు కొత్తపేట సర్పంచ్ స్థానానికి 5, వార్డుకు 18, తమ్మడపల్లె సర్పంచ్ స్థానానికి రెండు, వార్డుకు 15, నందవరం సర్పంచ్ స్థానానికి 5, వార్డులకు 31 నామినేషన్ వచ్చినట్లు ఆయన తెలిపారు. వెంకటాపురం సర్పంచ్ స్థానానికి నాలుగు, వార్డులకు 10, నందివర్గం సర్పంచ్ స్థానానికి మూడు, వార్డులకు 12, తిమ్మాపురం సర్పంచ్ స్థానానికి ఒకటి ,వార్డులకు 10 ,రామతీర్థం సర్పంచ్ స్థానానికి రెండు, వార్డులకు 10, పలుకూరు సర్పంచ్ స్థానానికి మూడు, వార్డులకు రెండు, బీరవోలు సర్పంచ్ స్థానానికి ఒకటి, వార్డులకు 11, చెరువు పల్లె సర్పంచ్ స్థానానికి రెండు, వార్డులకు 20 నామినేషన్ వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు

జిల్లా కలెక్టరేట్ ఆవరణలో రూ.28 లక్షలతో అత్యాధునిక వసతులతో కూడిన స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 నిధులతో ఆస్పిరేషనల్ పింక్ టాయిలెట్స్ ఏర్పాటు.

●మహిళలు, పురుషులకు దివ్యాంగులకు ప్రత్యేక వసతులతో టాయిలెట్ ఏర్పాటు.

● పాలిచ్చే తల్లుల కోసం ప్రత్యేక గది ఏర్పాటు. ● పారంభోత్సవం చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగుల సౌకర్యార్థం మెరుగైన పారిశుద్ధ్యశీ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 నిధులతో కలెక్టరేట్ ఆవరణలో సుమారు రూ.28 లక్షల అంచనా వ్యయంతో అత్యాధునిక వసతులతో కూడిన ఆస్పిరేషనల్ పింక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు.

గురువారం కలెక్టరేట్ ఆవరణలో రూ.28 లక్షలతో అత్యాధునిక వసతులతో కూడిన పింక్ టాయిలెట్ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రారంభోత్సవం చేశారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగుల సౌకర్యార్థం మెరుగైన పారిశుద్ధ్యశీ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో కలెక్టరేట్ ఆవరణలో సుమారు రూ.28 లక్షల అంచనా వ్యయంతో



అత్యాధునిక వసతులతో కూడిన పింక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న టాయిలెట్స్ మహిళలు, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళల మరుగుదొడ్డిని సులభంగా గుర్తించేందుకు పింక్ కలర్ థీమ్‌ను రూపొందించడం జరిగిందని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా సానిటరీ పాడ్ ఇన్ సేనిటరీ, పాడ్ వెండింగ్ మిషన్ వంటి సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. చిన్నపిల్లలకు పాలిచ్చే తల్లుల సౌకర్యార్థం ప్రత్యేక విశ్రాంతి గదిని ఏర్పాటు చేసి, అందులో సోఫా, ఊయల వంటి సదుపాయాలను కల్పించామన్నారు. గతంలో ఉన్న డ్రైనేజీ సమస్యలను పూర్తిగా పరిష్కరించేలా నూతన పైప్‌లైన్ వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన ప్రవేశ మార్గాలు, ఇతర అనుబంధ వసతులను కూడా అభివృద్ధి చేసామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణ, పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చు



ఉద్యోగులందరూ ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఆవరణంలో ఉద్యోగుల శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక షటిల్ కోర్టును ప్రారంభించారు. ఉద్యోగులు రోజువారీ విధులతో పాటు క్రీడలు, వ్యాయామానికి కొంత సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు ఈ సదుపాయం దోహదపడుతుందన్నారు. ఉద్యోగులందరూ విధి నిర్వహణతో పాటు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

19వ వార్డులో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి.

-ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్ లక్ష్మన్న

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని 19వ



వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం 19వ వార్డు కౌన్సిలర్ లక్ష్మన్న ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో వినతిపత్రం అందజేశారు.

ఆదోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, ఆర్థిక సభ్యులు మధుకుమార్, సాంకేతిక సభ్యులు జయకృష్ణారెడ్డి, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఈఈ పురుషోత్తం తదితరులకు వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కౌన్సిలర్ లక్ష్మన్నతో పాటు నాయకులు తిప్పన్న, కృష్ణమూర్తి, కాలనీ వాసులు నాగేంద్ర, వీరేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షేర్ఖాన్ కొట్టాలు, తిక్కస్వామి దర్గా వెనుక, దేవీ నర్సింగ్ హోమ్ వెనుక, కృష్ణ దేవాలయం వెనుక, బండమిట్ట, ఎం.ఎం. కాలనీ ప్రాంతాల్లో ప్రజలు చాలాకాలంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ముఖ్యంగా షేర్ఖాన్ కొట్టాల్లోని జమ్మిచెట్టు కొట్టాలు, ఎస్సీ హాస్టల్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. కూలిపోయే పరిస్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణ దేవాలయం వెనుక, తిక్కస్వామి దర్గా సమీపంలో నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, బండమిట్ట, ఎం.ఎం. కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు. సున్నంబట్టి రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో సురక్షిత ప్రాంతానికి తరలించాలని, విద్యుత్ స్తంభాలు లేని ప్రాంతాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

వార్డు ప్రజల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ లక్ష్మన్న తెలిపారు.

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల

ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం..

-నూతన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలకు .....

-ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 19



ఎమ్మిగనూరు, గోనెగండ్ల నందవరం మండలాల్లో నిర్వహించిన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మూడు మండలాలకు నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల వివరాలు



ఎమ్మిగనూరు మండలంఎంపీపీ కె. పుష్పావతి కె. తిమ్మాపురం

వైస్ ఎంపీపీ: షేక్ రసూల్ బీ కోటేకల్-1

నందవరం మండలం

ఎంపీపీ చార్లెస్ గురుజాల

వైస్ ఎంపీపీ గొల్ల రాధమ్మ సుజాత పొనకలదిన్నె

గోనెగండ్ల మండలం

ఎంపీపీ కుమారి నందవరం మౌనిక పెద్దమరివీడు

వైస్ ఎంపీపీ: శ్రీ అచ్చుగట్ల ఫక్రుద్దీన్ గోనెగండ్ల-

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలోని అన్ని ఎంపీటీసీ ప్రాంతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, ప్రొసీడింగ్ అధికారులు, ఎంపీడీవోలు, టీడీపీ కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

మండలఅధ్యక్షులు,ఉపాధ్యక్షులకుఎమ్మెల్యే

భూమా అఖిలప్రియ అభినందనలు

దొర్నిపాడు నవంబర్ 19 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు స్థానిక ఎంపీడీవో కార్యాలయం



నందు గురువారం జరిగిన ఎంపీపీ, ఉపాధ్యక్షుల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన టిడిపి అధ్యక్ష ,ఉపాధ్యక్షులు పాదం సుస్మిత, నంద గారి సరస్వతి, ఎంపీటీసీలను ఆర్లగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈసందర్భంగాఆమెమాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మీరందరూ మీ బాధ్యతలను విధులను విస్మరించకుండా ప్రజాసేవకు అంకితమై, గ్రామాల అభివృద్ధికి మీ వంతు కృషి చేసి టిడిపి పార్టీకి పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని వారిని కోరారు, నా వంత సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అన్నారు, ప్రభుత్వం నుండి వచ్చే నిధులను దుర్వినియోగం చేయకుండా అభివృద్ధిపనులకుఉపయోగించాలన్నారు,ఈ కార్యక్రమంలో ఆర్లగడ్డ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సురేంద్ర నీటి సంఘం డి సి చైర్మన్ లుప్రసాద్ రెడ్డి,బొబ్బూరి చిన్న వెంకటస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు సత్యం, జడ్పిటిసి కేదాటి పార్వతి,నాయుడు, ఎన్ శ్రీను ,నారాయణ ,కాశిరెడ్డి అపర్ణ, పాదం శీను, గంగవరం కృష్ణారెడ్డి, చవ్వ శివారెడ్డి మల్లికార్జున, బి శేఖర్, హుసేని, బాలస్వామి, అశోక్, శ్రీనివాసరావు, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

గ్రామ అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం.,,,,



నందవరం పల్లె వెలుగు నవంబర్ 19 నందవరం గ్రామంలో ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నందవరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ముందుకు వచ్చానని తెలిపారు. విద్యావంతురాలైన మహిళగా గ్రామ ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేస్తానని పేర్కొన్నారు,అవినితిరహిత పాలన అందించడం, పంచాయతి నిదులు మరియు ప్రభుత్వ నిదులు దుర్వినియాగం కాకుండగా ప్రతిరూపాయి గ్రామాభివృద్ధికి వినియోగించేలా చెయ్యడం మా లక్ష్యం. గ్రామంలో త్రాగునీటి సమస్య, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. మహిళలు, యువత, రైతులు, వృద్ధులు ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలనుకుంటున్నానని అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలందరినీ కలుపుకొని నందవరం అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల ఆశీర్వాదం మరియు సహకారం కోరుకుంటున్నానని సంగీత దేశాయ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి నా ఆశయం. ప్రజాసేవే నా లక్ష్యం!

పిన్నాపురం గ్రీన్‌కో ప్రాజెక్టు విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ





పాణ్యం నవంబర్ 19 పల్లె వెలుగు : పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలోని గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1,200 మెగావాట్ల నుంచి 1,680 మెగావాట్లకు పెంచే ప్రతిపాదనపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా పాల్గొని ప్రజల అభిప్రాయాలు, సూచనలు, వినతులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కల్పించాలని గ్రామస్తులు కోరారు. గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, పర్యావరణ పరిరక్షణకు సంస్థ సహకరించాలని సూచించారు. పిన్నాపురం గ్రామాన్ని 100 శాతం సౌర విద్యుత్ వినియోగ గ్రామంగా తీర్చిదిద్దే ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, గ్రీన్‌కో ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీపీ ,ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎంపీటీసీలతో రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ

దొర్నిపాడు నవంబర్ 19 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడుమండల ఎంపీపీగా పాదంసుస్మిత,ఉపాధ్యక్షురాలిగనందగారి సరస్వతి లను ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా రిటర్నింగ్ అధికారి నాగరాజు ఎంపీటీసీలుగచెలుముగారిఅశోక్ కుమార్ హేమంత్ యాదవ్ పాదం సుస్మిత, గడ్డం చిన్న పుల్లయ్య,నందగారిసరస్వతి,చిన్న



ఉసేని, మేరి, మెర్సి, ల చేత ప్రమాణాస్వీకారం చేయించారు. అనంతరం ఎంపీపీగా సుస్మిత, వైస్ ఎంపీపీగా సరస్వతిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సావిత్రి, డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాద్ ఏవో జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Palleveluguneews9@gmail.com